# టూలేట్

బేగంపేట విమానాశ్రయానికి టేక్సీలో, టేక్సీకన్నా వేగంగా ఉన్న మనస్సుతో వచ్చాడు శశికుమార్– అప్పుడున్న బోంబే ఫ్లైట్ అందుకోవాలని తాపత్రయం.

ఓ ప్రైవేట్... కౌంటర్ దగ్గరకెళ్లి... ఆత్రంగా టికెట్ తీసుకోబోయాడు.

"సారీ.. యూ ఆర్ టూ లేట్! జస్ట్ ట్వెంటీ మినిట్స్ బేక్ ద లాస్ట్ ఫ్లైయిట్ ఆల్సో...'.

శశికుమార్ కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

ఈ మధ్య 'యూ ఆర్ టూ లేట్' అని ఎన్నిసార్లు విన్నాడో...

యస్.. అయామ్... 'టూ లేట్!' అనుకున్నాడు.

✦ ✦ ✦

పాతికేళ్ల క్రితం పాతికేళ్ల శశికుమార్ విదేశాల వ్యామోహంతో కన్నవాళ్లనొదిలి వచ్చేశాడు. అదో అందమైన స్వప్నం– అద్భుతమైన అమెరికా స్వర్గం.

ఏదో ఉద్యోగంలో చేరాడు గానీ.. అది వదిలేసి మరో గోల్డెన్ డాలర్ చేయిపట్టి ఆమె డైరెక్షన్‌లో అంచెలంచెలుగా ఎదిగాడు– ఎదిగాడో.. దిగజారాడో తెల్సుకునేప్పటికి టూ లేట్. అయిపోయింది!

భార్య ఎసీలెన్ డైరెక్షన్ డామినేట్ చేసింది– అని తెల్సేటప్పటికి.. అతనికి 50 ఏళ్లు తలమీదకొచ్చాయి. కాళ్లు ఈ భూమ్మీద నిలవడానికి

సహకరించట్లేదు.

"నేను మా దేశం వెళ్లిపోతాను" అన్నాడు అరుస్తున్నట్లుగా ఓ రోజు.

"ఎక్కడికి" అని ఇంగ్లీషులో నవ్వింది ఎసీలెన్ ఎకసెక్కంగా.

"మా అమ్మా నాన్న దగ్గరికి" గంభీరంగా అన్నాడు శశికుమార్.

"ఓ.. అర్ దే ఎలైవ్... యూనో.. వాళ్లెపుడో పోయుంటారు"

శశికుమార్ దగ్గర సమాధానం లేదు.

ఎగిరిపడి నవ్వింది ఎసీలెన్- నవ్వుతున్నంతసేపూ శశి గుండె రగుల్తూనే వుంది.

"యూ.. ఆర్.. ఏ గ్రేట్ సన్ ఆఫ్ ది పూర్ పేరెంట్స్"

"నో.. ఆయామ్ ఏ పూర్ సన్ ఆఫ్ ది గ్రేట్ పేరెంట్స్"

"యూ ఆర్ టూ లేట్"

"నీ నిజ స్వరూపం తెల్సుకోడానికా..."

"నీ స్వస్వరూపం తెల్సుకోవడానికి... యూ ఆర్ టూ లేట్"

✦ ✦ ✦

అర్ధాంగిపై అలిగి, అమెరికా వదిలి, అమ్మా నాన్న కోసం వెళ్దామనుకునేటప్పటికి పాతికేళ్లు గడిచిపోయింది... ఎసీలెన్ అన్నది నిజమేమో... వాళ్లింకా బతికున్నారో లేదో.

అవును పాతికేళ్లనుంచీ ఉత్తరప్రత్యుత్తరాలు జరగలేదు.

తన ఎడ్రస్ కూడా వాళ్లకి తెలియనివ్వలేదు.

పిఠాపురమో, పెందుర్తో అంటే తెలుస్తుంది కానీ... అమెరికాలో వినిసోటా.. అంటే ఏం తెలుస్తుంది. అందుకే వాళ్లనుంచి ఏ కేకలూ

వినిపించకుండా వాళ్లెలా వున్నారో అన్న ఆలోచన లేకుండా.. బిజీ బిజినెస్‌ల్లో ఇన్నాళ్లు గడిపేశాడు.

పాతికేళ్ళ తర్వాత వెళ్తే అమ్మానాన్నా ఆగ్రహిస్తారా... ఆనందిస్తారా ఆగ్రహిస్తే ఆ పరిస్థితి ఎలా తట్టుకోవాలో తనకి తోచలేదు.

కానీ వెళ్లాలి! టూ లేట్ అయినా వెళ్లాలి! ఎంత లేట్ అయినా వెళ్లాలి!

అమ్మా నాన్న 'ఎంతగా పరితపించెనో.. ఏమనుచు దుఃఖించెనో...' అన్న మాటా...

'అమ్మా అని అరిచినా.. ఆలకించవేమమ్మా' అన్న పాటా గుండెల్లో మరతిప్పుతోంది.

"యస్.. ఆయామ్.. టూ లేట్' అనుకున్నాడు శశికుమార్.

✦ ✦ ✦

ఆదరాబాదరా హైదరాబాద్ చేరాడు.

ఇల్లు ముందు భాగం పూర్తిగా కూలిపోయింది.

విశాలమైన హాలు ఓ అరుగులా మారిపోయింది. పక్కనుండే పడగ్గది ప్రధాన ద్వారం అయింది.. శశికుమార్‌కి కళ్లు చెమర్చాయి.

'తను పూర్తిగా వీళ్లని వదిలెయ్యకుంటే- ఈ ఇల్లు ఇలా కూలిపోయేదా...' అన్న భావన గుండె పిండింది.

తలుపుకొట్టి నిలబడ్డాడు-

70 ఏళ్లు మించి ముసలాడిగా కనిపిస్తున్న ఓ వ్యక్తి తలుపు తీశాడు.

"ఎవరు స్వామీ... ఎవరు కావాలి?"

"నా పేరు శశికుమార్... లలిత్ నారాయణగారు లేరా..."

లలిత్ నారాయణ దేహం అంతా కంపించింది.

చనిపోయిన వ్యక్తి వచ్చి... 'నేను ఫలానా' అని చెప్పినప్పటి భయం వణుకు అది!

"ఏమన్నావ్.. శ... శి... కు.. మా...ర్..వా?"

"అవునండీ- లలిత్ నారాయణగారీ... గారి కోసం"

"ఎవరండీ..." అలికిడి విన్న శకుంతల భర్త వెనకగా నిలబడి వచ్చిన వ్యక్తిని చూస్తూ అడిగింది.

శశికుమార్ తల్లిని గుర్తుపట్టాడు.

"అమ్మా.. నేను... శశిని!! నాన్నా... నేను!!"

"ఆ.. శశివేనా ఆ.." అంటూ ఆమె కుప్పకూలిపోయింది.

ఆ ఆక్రందనకి చేతనంలోకి వచ్చాడు నారాయణ!

భార్య ముందు కూచుని ఆమెని సముదాయించబోయాడు.

శశికుమార్ అమ్మ పక్కకి చేరాడు.

"ఏవండీ.. వాడు శశేనా.. శశిదెయ్యం కాదు కదా!" అంటూ బావురుమని ఏడిచింది.

శశికుమార్‌కి తను గనక చచ్చిపోయివుంటే వీళ్లకిన్నాళ్లు కనిపించకుండా ఉంటానా- దయ్యంలా ఎప్పుడో వచ్చి సాయపడేవాణ్ననిపించింది!

"అవున్టే- వాడేట- నేను పోల్చుకోలేకపోతున్నాను" మాటలు కూడబలుక్కుంటూ అన్నాడు నారాయణ.

శకుంతల ఏడుస్తూ లేచింది. వణుకుతున్న చేతుల్లోకి అతని ముఖాన్ని తీసుకుని తడిమి... "శశీ.. నాన్నా శశీ... నువ్వేనా... నువ్ శశివేనా"

"అవునమ్మా నేనే.." అంటూ ఆమెని కౌగిలించుకున్నాడు- ఆనందమో దుఃఖమో తెలియదు- ఆవిడ ఏడుపునాపుకోడానికి చాలాసేపే అతని చేతుల్లో ఉండిపోయింది. నెమ్మదిగా కోలుకుంది. అతన్ని విడిపించుకుంది. తీక్షణంగా చూసింది...

"ఎందుకొచ్చావ్... ఎందుకొచ్చావురా- వీణ్ని ఎందుకు లోపలికి రానిచ్చారండీ" అని భర్తని నిలదీసింది.

"వీడు చచ్చిపోయాడని ఎప్పుడో నీళ్ళొదిలేసేం కదండీ- వీడు నా బిడ్డకాదు- పొమ్మనండి"

"అమ్మా... అమ్మా... నన్ను క్షమించవా..."

"నిన్ను క్షమించడానికి నీకు అమ్మలేదురా.. నాకు కనిపించకు ఈ దేశం విడిచి వెళ్లిపో దూరంగా- పో..."

"నాన్నా"

"చాలా రోజుల్నుంచి మీ అమ్మ ఏడుపు మర్చిపోయి బతుకు తోందిరా... నువ్వొచ్చి ఆవిడ ఆయుర్దాయాన్ని తగ్గించకు- వెళ్లిపోరా"

"ఇప్పుడు విమానం కూడా లేదు"

"లేకపోతే రోడ్డుమీద పడిగాపులు పడమనండి! ఇక్కడింకొక్క క్షణం కూడా ఉండద్దనండి!"

"అవునయ్యా... వెళ్లిపో"

శశికుమార్ విషాదంగా బైటికి నడిచాడు.

అతను వెళ్లీవెళ్లగానే 'ఠప్'మంటూ తలుపులు మూసుకున్నాయి.

శశికుమార్ విరక్తుడై టేక్సీస్టాండ్‌కెళ్లాడు.

శకుంతల అతను వెళ్లిపోయాడని తెల్సుకున్నాక తలుపులు తెరిచింది.

"వెళ్ళిపోయాడండీ.. నా యిష్టం ఇది నా ఇల్లు అనకుండా వెళ్ళిపోయాడండీ... వాడు వెళ్లడు... నేనే గెంటేశాను... నేనే గెంటేశాను.. గుప్పెడన్నం కూడా పెట్టకుండా గెంటేశా" అని ఎక్కెక్కి ఏడిచింది.

ఆమెని నారాయణ ఓదార్చక్కర్లేకుండానే... ఏడుపాగిపోయింది... ఊపిరి ఆగిపోయింది!

నారాయణలో ఏమీ విచారం లేదు.

కర్తవ్యం తెల్సింది బైటకెళ్లాడు.

✦ ✦ ✦

ఎయిర్‌పోర్ట్ దగ్గర దిగాలుగా కూచున్న కొడుకుని ఆటోలో ఇంటికి తీసుకొచ్చాడు.

"ఒరే... ఇన్నాళ్లకి నీకు మేము ఎందుకు గుర్తొచ్చామో ఎందుకు రావాలనిపించిందో... ఇప్పుడు అర్థమైంది కదా... మీ అమ్మకి నిప్పు పెట్టి- ఆవిడ పేరు చెప్పి గుప్పెడన్నం తిని వెళ్లరా- మీ అమ్మ వండిందే... తన చేత్తో వండిన ఆఖరిముద్ద నీదే అయింది. తిని వెళ్లరా దాని ఆత్మ శాంతిస్తుంది..."

శశికుమార్‌ని ఓదార్చటం నారాయణ వల్ల కాలేదు.

"నేనెప్పుడూ టూ లేట్‌గాణ్ణే నాన్నా" అని బావురుమన్నాడు.

"అమ్మా నన్నెప్పటికీ క్షమించవా..." కుళ్లి కుళ్లి ఏడుస్తున్నాడు.

"క్షమించిందిరా! అందుకే కొరివిపట్టే అవకాశం నీకిచ్చింది- వెళ్లు" నారాయణ కొడుకుని లేపాడు.

'ఇప్పుడు మాత్రం నేను టైముకే వచ్చాను! టూ లేట్ కాదు' అనుకున్నాడు శశి ఏడుస్తూ.